అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- 80 బన్నూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

జూపాడుబంగ్లా: అవినీతి, అక్రమాలకు తావులేకుండా అర్హులందరికీ ఇళ్లవద్దకే ప్రభుత్వ పథకాలు అందేలా చేయడమే సీఎం జగనన్న ధ్యేయమని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ తెలిపారు. సోమవారం మండలంలోని 80 బన్నూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. మూడున్నరేళ్ల కాలంలో ప్రభుత్వం వారికి మంజూరు చేసిన సంక్షేమ పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో పచ్చచొక్కాలు వేసుకున్న వారికి, టీడీపీ నాయకులకు లంచాలు ఇచ్చిన వారికి మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. జగనన్న సీఎం అయ్యాక అవినీతికి తావులేకుండా, ఎవరి సిఫారసు లేకుండా అర్హత ఉంటే చాలు ఇంటివద్దకే సంక్షేమ



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

పథకాలు అందిస్తున్నారని చెప్పారు. గ్రామస్వరాజ్య స్థాపనలో భాగంగా సచివాలయ, వలంటీరు వ్యవస్థలను ఏర్పాటు చేసి పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ ఉన్న ఊళ్లోనే సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డి దన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో పాటు చాకలిపేటలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. చాకలిపేటలో సత్వరమే నూతన బోరును తవ్వించి నీటిసమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ మంజులవాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేశ్వరమ్మ, రమేష్‌గౌడు, శివానందరెడ్డి, ఉస్మాన్‌బాషా, కరుణాకర్ రెడ్డి, తరిగోపుల కృష్ణారెడ్డి, జంగాలపెద్దన్న, కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ బాలమద్దిలేటి, నాగటూరు సుధాకర్‌రెడ్డి, రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాతీయగీతం నేర్పించకపోతే ఎలా?

పాఠశాలలో నిత్యం పాడుకునే జాతీయగీతాన్ని కూడా విద్యార్థులకు నేర్పించకపోతే మీరేం పాఠాలు చెబుతున్నారంటూ ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అసహనం వ్యక్తం చేశారు. 80బన్నూరులోని ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని ఐదో తరగతి విద్యార్థులను లేపి జాతీయగీతం పాడాలని కోరారు. దీంతో విద్యార్థులు ఎవరూ సక్రమంగా జాతీయగీతాన్ని పాడలేకపోయారు. దీంతో ఎమ్మెల్యే ఉపాధ్యాయులెవరంటూ వారిని పిలిచి మీరేం పాఠాలు చెబుతున్నారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా చదువులు చెబుతుంటే మీరు పాఠశాలలను ఏమి తనిఖీ చేస్తున్నారంటూ ఎంఈఓ మోహన్‌పై మండిపడ్డారు.

సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు



ఉమామహేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

పాములపాడు: కొత్తపల్లి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సప్తనదుల సంగమేశ్వరంలోని ఎగువ పుష్కర ఘాటు వద్దనున్న ఉమామహేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగమేశ్వరుడు జలాధివాసం వీడుతున్న తరుణంలో భక్తులు అధిక సంఖ్యలో చేరుకుంటున్నారు. కాగా ఆలయం పూర్తిగా బయట పడకపోవడంతో ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తూ సంగమేశ్వరుడిని దర్శించుకుంటున్నారు. ఈ నెల చివర్లో సంగమేశ్వరుడు పూర్తిగా భక్తులకు దర్శనమిచ్చే అవకాశం ఉంటుంది.

క్లుప్తంగా

ప్రతినెలా పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి



ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న సలోమి

ఆత్మకూరురూరల్: పౌరహక్కుల దినోత్సవాన్ని ప్రతినెల 30వ తేదీన కచ్చితంగా నిర్వహించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు చిటికెల సలోమి కోరారు. ఈ మేరకు సోమవారం ఆత్మకూరు ఆర్డీఓ దాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 17 ద్వారా ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు హామీ లభించిందని తెలిపారు. ప్రతి నెల 30న దళిత, గిరిజన ప్రజలు నివసించే ప్రాంతాల్లో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని చట్టం నిర్దేశిస్తోందని, అయితే ఈ మధ్య కాలంలో ఈ కార్యక్రమం జరగడంలేదన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

పగిడ్యాల: రోడ్డు ప్రమాదాల కేసుల్లో పురోగతిని సాధించి, నేరాలను నియంత్రించేందుకు గ్రామస్తుల సహకారంతో లక్ష్మాపురం క్రాస్ రోడ్డు వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున తెలిపారు. సోమవారం ఆయన ముచ్చుమర్రి స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తూర్పు, పడమర ప్రాతకోట సంక్రాంతి ఉత్సవాల సమయంలో అంచె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. ఈ ప్రమాదానికి కారణమైన ఆటో ఆచూకీని గుర్తించడానికి సాంకేతికమైన సమస్యలు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. పోలీసుల విజ్ఞప్తి మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు లక్ష్మాపురం గ్రామ పెద్దలు ముందుకు రాగా, రెండు కెమెరాలు అమర్చినట్లు వెల్లడించారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలపై నేడు సమావేశం

మహానంది: మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం నంద్యాలలో మొదటి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నంద్యాలలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ అధ్యక్షతన సమావేశం ఉంటుందన్నారు. చైర్మన్ కొమ్మా మహేశ్వర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులతో పాటు రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీరాజ్, రవాణా, వైద్యారోగ్యశాఖ, అగ్నిమాపక, ఇతర శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది మరింత మెరుగ్గా ఉత్సవాలు నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

కాలుష్య నివారణ కోసం సైకిల్ యాత్ర



సైకిల్‌పై యాత్ర చేస్తున్న సుదీప్‌దాస్

ఆత్మకూరురూరల్: ప్రపంచ కాలుష్య నివారణ కోరుతూ కోల్‌కతాకు చెందిన సుదీప్‌దాస్ సైకిల్‌పై దేశాటనకు బయలుదేరాడు. సోమవారం ఆయన తన యాత్రలో భాగంగా ఆత్మకూరు నుంచి నంద్యాల వెళుతూ కనిపించాడు. ప్రపంచమంతా పంచభూతాలు కాలుష్య కాటుకు గురవుతున్నాయని, స్వచ్ఛమైన వాయువు, నీరు, ఆహారం ప్రపంచ ప్రజల హక్కు అని, ఈ విషయమై అవగాహన కల్పిస్తూ తన సైకిల్ యాత్ర సాగుతుందని సుదీప్‌దాస్ తెలిపాడు. కోల్‌కతా సమ్మిలోని మహావిద్యాలయలో బీఏ రెండవ సంవత్సరం చదువుతున్నట్లు తెలిపాడు.

పన్ను వసూళ్లు వేగవంతం చేయండి

మిడుతూరు: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను, కుళాయి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని ఈఓఆర్డీ ఫక్రుద్దీన్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మాపురం, బైరాపురం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా, నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, నీటికి క్లోరినేషన్ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు షఫీ అహమ్మద్, ఫరీద్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సమస్యకు పరిష్కారం

చింతలపల్లి గ్రామంలోని బీసీ కాలనీలో కూళాయిలు ఏర్పాటుచేసి నీటి సమస్యను పరిష్కరించినట్లు పీఎస్ వినయ్ చంద్ర తెలిపారు. గ్రామ సర్పంచ్ రవణమ్మ సహకారంతో పనులు చేయించినట్లు వెల్లడించారు.

నకిలీ మందులని తేలితే కఠిన చర్యలు

పాముపాడు: నకిలీ పురుగు మందులు అని తేలితే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పురుగుల మందుల దుకాణంలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నందికొట్కూరుకు చెందిన తులసీరావు అనే రైతు ఇక్కడ గరుడ కంపెనీకి చెందిన పోలీస్ అనే పురుగుల మందును కొనుగోలు చేశాడని, ఆ మందు నాణ్యత పై అనుమానం ఉందని కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చాడన్నారు. ఆ కంపెనీ వారు అంజనీ ట్రేడర్స్ దుకాణంలో తమ కంపెనీ పేరుతో నకిలీ మందులు అమ్ముతున్నట్లు తమకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు తనిఖీ నిర్వహించి రూ.17,400 విలువగల మందులు జప్తు చేసినట్లు చెప్పారు. వీటిని పరిశీలన నిమిత్తం ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ప్రతి రైతు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలు, రసాయన మందుల పై బిల్లు తీసుకోవాలని, నాణ్యత పై అనుమానం వస్తే ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో, మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఏఈఓ మద్దిలేటి తదితరులున్నారు.



పురుగు మందుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆంజనేయ

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని

మహానంది: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆర్.రామచంద్రారెడ్డి ఆదేశించారు. అల్లినగరం వద్ద జరుగుతున్న ఉపాధి పథకం పనులను సోమవారం పరిశీలించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు దినసరి వేతనం రూ.257 వచ్చే విధంగా మార్కింగ్ ఇవ్వాలని టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఉపాధి పనుల వద్ద ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ రామేశ్వర్‌రెడ్డి, టీఏ మాణిక్యమ్మ, ఎఫ్‌ఏ సోమన్న పాల్గొన్నారు



పనుల వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

మినీ సిస్టం ట్యాంక్ ప్రారంభం



మోటర్ ఆన్ చేసి ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ ప్రతాపరెడ్డి

పగిడ్యాల: మండల పరిధిలోని ఎం. ఘణపురం గ్రామ పంచాయతీకి మజరా గ్రామమైన ఎన్. ఘణపురంలో సర్పంచ్ ప్రతాపరెడ్డి సోమవారం నూతనంగా నిర్మంచిన మినీ సిస్టం ట్యాంక్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల కింద పంచాయతీ నిధులు రూ. 62 వేలతో మిని సిస్టం ట్యాంక్‌ను నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వర్కర్ ముత్తు, ఎల్ఐసీ శ్రీనివాసులు, ఉసేన్‌వలి, రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

ఆత్మకూరు: విద్యార్థులు ఆరోగ్యం పట్ల ఎల్లప్పుడు శ్రద్ధ వహించాలని బైర్లూటి వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. బైర్లూటి గూడెంలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినులు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. నిత్యం తప్పనిసరిగా చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రధానంగా భోజనం చేసే ముందు చేతులను శుభ్రపరుచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దీపికాబాయి, ల్యాబ్‌టెక్నీషియన్ సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరిక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి పవన్‌కుమార్

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాధికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఆశీన్నులను చేసి ఆలయ ప్రదక్షిణ చేయించారు.

మహానందీశుడికి పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, కామేశ్వరి సమేత మహానందీశ్వరస్వామివార్లు సోమవారం రాత్రి పల్లకీలో ఊరేగారు. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం పల్లకీలో కొలువు చేసి గణపతిపూజ, పుణ్యావహచనం, అలంకార పూజ, అలంకార హారతులు, మహామంగళహారతులు చేపట్టారు. ఆలయ ప్రాకారాలలో స్వామివార్లకు పల్లకీ ఉత్సవం వైభవంగా నిర్వహించారు.

శ్రీలక్ష్మీరంగనాథస్వామి దర్శన టికెట్ల ధర పెంపు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి వారి ప్రత్యేక దర్శనం టికెట్ల ధరను రూ.5 నుంచి రూ.10లకు పెంచినట్లు ఆలయ ఈఓ వెంకటరమణ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఏటా ఏప్రిల్ మాసంలో జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాలతో పాటు జాతర సందర్భంగా వేలాదిగా స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు రూ.5లు చెల్లించి టికెట్ కొనుగోలు చేసి దర్శనానికి వెళ్లేవారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా దర్శనం టికెట్ ధరను పెంచుతూ ఆలయ ధర్మకర్తల కమిటీ, అర్చకులు, ఈఓల సమక్షంలో తీర్మానించినట్లు తెలిపారు. దీనిపై భక్తులు సలహాలు, సూచనలతో పాటు అభ్యంతరాలుంటే వారంలో లిఖితపూర్వకంగా తెలియజేయాలని కోరారు.

అతివేగంతో ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దు

జూపాడుబంగ్లా: అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాపాయం కొని తెచ్చుకోవద్దని ఆత్మకూరు ఆర్టీఓ తిరుమలనాయుడు, టౌన్ సీఐ విజయభాస్కర్ అన్నారు. 34వ రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం నందికొట్కూరు పట్టణంలోని బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆర్టీఓ, సీఐ మాట్లాడుతూ యువకులు సరదాకోసం అతివేగంగా బైక్‌లను నడిపి ప్రమాదాలకు గురికావద్దన్నారు. అలాగే మద్యం సేవించి పొరపాటున కూడా వాహనాలను నడపరాదన్నారు. మైనర్ యువకులు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరమని, వారికి వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేయించిన వారిపై కేసులు నమోదుచేసే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సూదిరెడ్డి రమేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ జాన్‌ఎలిషా, లాయర్ వెంకటరాముడు, కళాశాల డైరెక్టర్ సూదిరెడ్డి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీఓ తిరుమలనాయుడు

ఆ స్థలానికి వైఎస్సార్‌సీపీ నాయకులకు సంబంధంలేదు

జూపాడుబంగ్లా: నాల్గొవ అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలానికి వైఎస్సార్‌సీపీ నాయకులకు ఎలాంటి సంబంధం లేదని జూపాడుబంగ్లాకు చెందిన హబీబా అనే మహిళ తెలిపింది. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. 708/ఏ సర్వేనెంబర్‌లో తనకు ఐదు సెంట్ల స్థలం ఉందని, మొదటి నుంచి ఆ స్థలంలో తాము గుడిసెవేసుకొని ఉండేవారమని, తర్వాత ముస్లిం కాలనీలో ఇళ్లు కట్టుకోవటం వల్ల అక్కడ ఉంటున్నామని తెలిపింది. తమ స్థలాన్ని అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించడంతో తానే పాదులను పూడ్చించానని చెప్పింది. అంగన్‌వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎవరూ ఆక్రమించుకోలేదని, ఆ స్థలం తమదేనని, ఇతరులెవరికీ సంబంధం లేదని స్పష్టం చేసింది.

టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలి..

టీడీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు జంగాలపెద్దన్న అన్నారు. ఆయన మాట్లాడుతూ తాను అంగన్‌వాడీ కేంద్రం నిర్మాణం కోసం స్థలాన్ని పంచాయతీ తీర్మానం చేసి కేటాయిస్తే తానే స్థలాన్ని ఆక్రమించుకున్నానని కొంత మంది టీడీపీ నాయకులు పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టిబాలస్వామి, వార్డు మెంబర్ మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న హబీబా

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

మిడుతూరు: ఆధార్ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శులు షఫీ అహమ్మద్, వినయ్ చంద్ర కోరారు. సోమవారం మండలపరిధిలోని చెరుకుచెర్ల, చింతలపల్లి గ్రామాల్లో ఆధార్ శిబిరాలను నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆదార్ అప్‌డేట్, ఎన్‌రోల్‌మెంట్, తప్పు, ఒప్పుల సవరణలు చేస్తున్నట్లు తెలిపారు. చెరుకుచెర్ల గ్రామంలో ఆధార్ క్యాంపును సర్పంచ్ మరియమ్మ పరిశీలించారు.

ఇంధన పొదుపుపై అవగాహన అవసరం

వెలుగోడు: ఇంధన పొదుపుపై వినియోగదారులకు అవగాహన అవసరమని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. నళిని అన్నారు. ఎనర్జీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు వెలుగోడు పట్టణ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నదన్నారు. ప్రతి ఒక్కరూ చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకుని విద్యుత్‌ను పొదుపు చేయగలిగితే, విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లేనన్నారు. నేడు సాంకేతిక పరంగా తక్కువ విద్యుత్ వినియోగించుకొనే ఉపకరణలు మార్కెట్లోకి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఎనర్జీ క్లబ్ ప్రతినిధి పుల్లయ్య పాల్గొన్నారు.

'మా డబ్బులు కాజేసింది'

పాములపాడు: పొదుపు గ్రూపుకు లీడర్‌గా, వీబీకేగా విధులు నిర్వహిస్తున్న విజయకుమారి మా డబ్బు కాజేసిందని మద్దూరు గ్రామ పంచాయతీ మజరా కృష్ణానగర్ గ్రామానికి చెందిన ఇందిరా గ్రూపు సభ్యులు సోమవారం ఎస్ఐ అశోక్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రూపు సభ్యులు నాగశేషమ్మ, సరోజమ్మ, లక్ష్మినారాయణమ్మ, మల్లేశ్వరీ, వెంకటేశ్వరీ, మద్దమ్మలు మాట్లాడుతూ వెలుగోడు మండలం రేగడగూగూరు గ్రామంలోని ఏపీజీబీలో తమ గ్రూపు సభ్యులు రూ.5లక్షలు రుణం తీసుకున్నామన్నారు. ప్రతి నెలా రూ.22,000 గ్రూపు లీడరుకు రుణం జమ చేయాలని సభ్యులందరము చెల్లిస్తూ వచ్చామన్నారు. లోన్‌పూర్తిగా చెల్లించాము కదా మరలా లోన్ తీసుకోవాలని ప్రయత్నిస్తుండగా అప్పు రూ.4,70,000 ఉందని బ్యాంకు వారు చెప్పారన్నారు. ఆరా తీయగా తమ గ్రూపు లీడరు బ్యాంకులో జమ చేయకుండా కాజేసిందని అర్థమయ్యిందని వాపోయారు.

పొదుపు మహిళలకు శిక్షణ

శ్రీశైలంప్రాజెక్ట్: మండలంలోని 90 పొదుపు మహిళా గ్రూపులకు ఉపాధి కోసం 15 రోజుల పాటు శిక్షణను ఇస్తున్నట్లు నాబార్డ్ డీడీఎమ్ ఎ.పార్థవ తెలిపారు.సోమవారం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పెట్టికోటులు, నైటీల తయారీలో సున్నిపెంట, లింగాలగట్టు, శ్రీశైలం పొదుపు మహిళలకు 15 రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు నాబార్డ్ సర్టిఫికెట్ అందజేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీజీబీ (సున్నిపెంట) బ్యాంక్‌మేనేజర్ ప్రవీణ్, శ్రీశైలం బ్రాంచ్ మేనేజర్ శర్మ, డీఆర్‌డీఏ ఏపీఎం శివ, మెరాకిల్ స్వచ్ఛంద సేవాసంస్థ సీఈఓ ఎండీ జావేద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకుంటాం

ఆత్మకూరు: దేశంలో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను అడ్డుకుంటామని, విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని సీపీఐ, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి ప్రతాప్ అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 25న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపడుతున్నామని, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్డీఓ దాస్ కు వినతిపత్రం అందజేశారు. ఇమామ్, అహ్మద్‌హుస్సేన్, లాలు, మాబాషా, సయ్యద్ పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

వెలుగోడు: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి మహిళలు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని పురోహితులు నరసరామ శర్మ ఆధ్వర్యంలో మూల విరాట్‌కు అభిషేకం, ఉత్సవ విగ్రహానికి పంచామత అభిషేకాలు, 108 మందితో సాముహిక మణిదీప వర్ణన 9 సార్లు చేయించారు. లలితా సహస్ర పారాయణాలు, అమ్మవారి జీవిత చరిత్ర చదివి వినిపించారు. అనంతరం భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు లాలం సుధాకర్, జుటూరు నాగపుల్లయ్య, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, రమణయ్య, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.



లలితా సహస్ర పారాయణం చేస్తున్న మహిళలు

వేదపండితులు తంగిరాల విశ్వనాథశర్మ శివైక్యం



శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రంలోని శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయంలో ద్వివేద పారాయణలో నిష్ణాతులైన వేదపండితుడు తంగిరాల విశ్వనాథశర్మ (75) సోమవారం శివైక్యం చెందారని ఆయన తనయుడు తంగిరాల దత్తు ఫోన్ ద్వారా సమాచారమందించారు. కొన్ని రోజులుగా అనారోగ్య కారణాల చేత రాజమండ్రి వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక కన్నుమూశారని, అక్కడే ఉంటున్న ఆయన ప్రథమ కుమారుడు సుబ్రహ్మణ్యం ఇంటి వద్దకు తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఆయనకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యకళారాధనలో భాగంగా సోమవారం ఏర్పాటు చేసిన సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం భక్తులను అలరించింది. కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన రాగరమ్య గ్రూప్ అకాడమీకి చెందిన సహస్ర, షణ్ముఖ, భరద్వాజ్, రామ, త్రినాథ, అర్జున్, మాధవి, చంద్రిక, నివేదిత తదితరులు నృత్యం చేశారు. అనంతరం హాస్యబ్రహ్మ డాక్టర్ శంకరనారాయణ రచించిన శంకర శతకం గ్రంథాన్ని దేవస్థానం ఈఓ ఎస్ లవన్న ఆవిష్కరించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం



విరాళాన్ని అందజేస్తున్న దాత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి సోమవారం కర్నూలుకు చెందిన ఎస్ చెన్నారెడ్డి రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందించి సత్కరించారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలి

జూపాడుబంగ్లా: పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కుమార్ కోరారు. ఈ మేరకు సోమవారం నందికొట్కూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే ఆర్థర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు హరివర్ధన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ మనందరి బాధ్యత



మానవహారంగా నిలిచిన విద్యార్థులు

మిడుతూరు: బాలికల సంరక్షణ మనందరి బాధ్యత అని ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన మిడుతూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా గ్రామ వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. బస్టాండులో మానవహారంగా నిలిచి ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లల పట్ల వివక్ష చూపకుండా వారికి సమాన అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు నాగరమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వరలక్ష్మి, రేణుకాదేవి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎంవీ రామచంద్రారెడ్డి పూజలు నిర్వహించారు. దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. స్థానిక అలంకార మండపంలో ఆలయ అధికారులు స్వామి,అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు దేవనాల శ్రీనివాసులు, చంద్రశేఖర్ రెడ్డి, రామఫక్కీరెడ్డి, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ జయంతి

వెలుగోడు: పట్టణంలోని ఐటీఐ కాలేజీలో నేహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి ప్రేరణ రూరల్ డెవలప్ మెంట్ ప్రసిడెంట్ నూలు నాగేశ్వరరావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ వలంటీర్ సురేష్ కుమార్, రవికిశోర్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

పగిడ్యాల: బ్రిటీష్ వారిపై తిరుగుబాటు పద్ధతిలో స్వాతంత్ర్యాన్ని సాధించాలని ఆజాద్ హిందూ ఫౌజ్‌ను స్థాపించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిరస్మరణీయుడని ప్రధానోపాధ్యాయులు షంషూర్‌ఖాన్ అన్నారు. సోమవారం కొత్త పాలమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నేతాజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రేస్ వినీల, కేపీ మల్లయ్య, సునితబాయి తదితరులు ఉన్నారు.



నేతాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం